కేటీఆర్‌పై కక్షపూరిత చర్యలు మానుకోవాలి

ఉప్పల్ : కేటీఆర్‌పై కక్షపూరిత చర్యలు మానుకోవాలని బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు కాసం మహిపాల్‌రెడ్డి అన్నారు. కేటీఆర్, బీఆర్ఎస్‌పై భయంతోనే సీఎం రేవంత్‌రెడ్డి వ్యవహరిస్తున్నారన్నారు. ఫార్ములా ఈ – కారు రేసుకు సంబంధించి ప్రభుత్వం వ్యహరిస్తున్న తీరు దారుణమన్నారు. అభివృద్ధిపై దృష్టిపెట్టకుండా, అక్రమ కేసులపై దృష్టిసారిస్తుందన్నారు. ఇబ్బందులకు గురిచేస్తున్న ప్రభుత్వానికి ప్రజలు గుణపాఠం చెబుతారన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

మేడ్చల్ : మేడ్చల్ మండల పరిధిలోని 11 కేవీ శ్రీరంగవరం, రాయిలాపూర్ ఫీడర్ల పరిధిలో శనివారం సరఫరాలో అంతరాయం ఉంటుందని రూరల్ ఏఈ తెలిపారు. ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు. శ్రీరంగవరం, బండమాదారం, రాయిలాపూర్‌ల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని పేర్కొన్నారు.

ఉప్పల్ : మరమ్మతుల కారణంగా శనివారం సరఫరా నిలిపివేస్తున్నట్లు ఉప్పల్ ఏఈ ఎం.నిఖిల్ తెలిపారు. శ్రీగిరికాలనీ, సాయిరాంనగర్, బీరప్పగడ్డ, బ్యాంక్‌కాలనీ, ధర్మపురి కాలనీ, ప్రశాంత్ నగర్, రాఘవేంద్ర నగర్, అన్నపూర్ణ కాలనీ, ఓల్డ్ , న్యూభరత్ నగర్, శ్రీనగర్ కాలనీ, కావేరి నగర్, ధర్మపురి కాలనీ, గణేశ్ నగర్, సెవెన్‌హిల్స్ కాలనీ, సాయిరాం నగర్, శ్రీనివాస హైట్స్, అపూర్వ హైట్స్, సాయిరాం నగర్, ఆదర్శ నగర్, ఆనంద్ నగర్, ఎంసీడౌన్ కాలనీ, న్యూహేమ నగర్, పద్మవతి కాలనీ, వెస్ట్‌బాలాజీ హిల్స్, ఎస్ఈ ఆఫీస్, ఉప్పల్ ప్రధాన రహదారి, రాజ్ నగర్, లక్ష్మారెడ్డి కాలనీ, రాఘవేంద్రకాలనీ, హనుమసాయి నగర్, సరస్వతిన గర్, సూర్యనగర్ ప్రాంతాల్లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ ఉండదన్నారు. 11 కేవీ సూర్య నగర్ ఫీడర్ పరిధిలోని సత్య నగర్, శాంతి నగర్, ఆదిత్య దవాఖాన పరిసరాలు, నల్లపోచమ్మ టెంపుల్, వెంకటేశ్వర కాలనీ ప్రాంతాల్లో ఉదయం 11:30 నుంచి 12 గంటల వరకు విద్యుత్ ఉండదని ఉప్పల్ భగాయత్ ఏఈ కిరణ్‌కుమార్ తెలిపారు.

ఉత్తరద్వార దర్శనాలకు పోటెత్తిన భక్తులు



చర్లపల్లి డివిజన్ కుషాయిగూడ శ్రీ పద్మావతివేంకటేశ్వర స్వామి ఆలయంలో ముక్కోటి ఏకాదశి పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, ఏఎస్‌రావు నగర్ కార్పొరేటర్ సింగిరెడ్డి శిరిషాసోమశేఖర్‌రెడ్డి

తిరుమల తిరుపతి దేవస్థానంలో పూజల అనంతరం ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి

కాప్రా / చర్లపల్లి : కాప్రాలో వైకుంఠ ఏకాదశి ఉత్సవాల సందర్భంగా ఆలయాల్లో ఉత్తర ద్వార దర్శనాలకోసం భక్తులు పోటెత్తారు. ఓల్డ్ కాప్రాలోని శ్రీలక్ష్మీచెన్నకేశవస్వామి ఆలయంలో జరిగిన వైకుంఠ ఏకాదశి ఉత్సవాలకు పరిసరకాలనీలనుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి ఉత్తరద్వారం ద్వారా స్వామివారిని దర్శించుకున్నారు. ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ఉత్తరద్వారం ద్వారా శ్రీలక్ష్మీచెన్నకేశవస్వామిని దర్శించుకున్నారు. ఆలయ పురోహితులు రవి మూర్తి శర్మ ఎమ్మెల్యేను పుష్పగుచ్ఛాలతో ఆశీర్వదించారు. ఏఎస్‌రావునగర్ డివిజన్‌లోని శ్రీ పద్మావతి వెంకటేశ్వరస్వామి ఆలయంలో జరిగిన ఉత్తరద్వార దర్శనానికి ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, ఏఎస్‌రావునగర్ డివిజన్ కార్పొరేటర్ సింగిరెడ్డి శిరీషా సోమశేఖర్‌రెడ్డి, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు సింగిరెడ్డి సోమశేఖర్‌రెడ్డి, ఉప్పల్ కాంగ్రెస్ ఇన్‌చార్జి మందుల పరమేశ్వర్‌రెడ్డి, చర్లపల్లి డివిజన్ కార్పొరేటర్ బొంతు శ్రీదేవియాదవ్, మాజీ కార్పొరేటర్ ధన్‌పాల్‌రెడ్డి, వివిధపార్టీల నాయకులు హాజరై ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు.

వైకుంఠ ఏకాదశి పూజలు

ఉప్పల్, జనవరి 10 : వైకుంఠ ఏకాదశి పురస్కరించుకొని ఉప్పల్ నియోజకవర్గంలోని పలు ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈమేరకు భక్తులకు ఉత్తర ద్వార దర్శనం కల్పించారు. నియోజకవర్గంలోని పలు ఆలయాలను ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, కార్పొరేటర్లు దర్శించుకొని, ప్రత్యేక పూజలు నిర్వహించారు. వెంకటేశ్వర స్వామి ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు నేతలు పాల్గొన్నారు.



నాచారంలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే బండారి, కార్పొరేటర్ శాంతిసాయిజెన్ శేఖర్

బీరప్పగడ్డలోని ఆలయంలో పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే బండారి, రాష్ట్ర నాయకులు బన్నాల

శ్రీ వేంకటేశ్వరుడి దీవెనలుంటాయి

మల్కాజిగిరి, జనవరి 10 : శ్రీ వేంకటేశ్వర స్వామి వారి దీవెనలు అందరికీ ఉంటాయని ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి అన్నారు. శుక్రవారం తిరుమల తిరుపతిలోని శ్రీవేంకటేశ్వర స్వామి దేవస్థానంలో వైకుంఠ ఏకదశి పర్వదినాన్ని పురస్కరించుకును ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి కుటుంబ సభ్యులతో పాటు పూజలు చేశారు.

మున్సిపల్ సమావేశం బహిష్కరణ

నిరసన తెలుపుతున్న దమ్మాయిగూడ మున్సిపాలిటీ పాలకవర్గ సభ్యులు

మేడ్చల్ కలెక్టరేట్ : తీర్మానించిన పనులకు నిధులు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ దమ్మాయిగూడ మున్సిపాలిటీ పాలకవర్గం సమావేశాన్ని బహిష్కరించింది. కమిషనర్ నిధులు ఇవ్వడానికి నిరాకరించడంతో శుక్రవారం చైర్‌పర్సన్ ప్రణీతశ్రీకాంత్ గౌడ్, సభ్యులు నిరసన తెలిపారు. అక్టోబర్‌లో జరిగిన సమావేశంలో 1 నుంచి 18 వార్డులకు మున్సిపాలిటీ సాధారణ నిధుల నుంచి వార్డుకు రూ.30 లక్షల చొప్పున మొత్తం రూ.5.4 కోట్లు అభివృద్ధి పనులకు కేటాయిస్తూ తీర్మానం చేశారు. నిధులు లేవని మున్సిపాలిటీ కమిషనర్ నాగమణి మంజూరు చేసేందుకు నిరాకరించారు. దాంతో చైర్‌పర్సన్‌తో సహా సభ్యులు సమావేశాన్ని బహిష్కరించి, నిరసన తెలిపారు. వేరే మున్సిపాలిటీల్లో ఈ పరిస్థితి లేదని, ఇక్కడ కావాలనే నిధులు మంజూరు చేయకుండా సాకులు చెపుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. విలీనమైన గ్రామాల్లో నిధులు కేటాయిస్తూ తమకు ఇవ్వకపోవడమేమిటని ప్రశ్నించారు. విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు. కాగా ఈ విషయమైన కమిషనర్ నాగమణి మాట్లాడుతూ.. కలెక్టర్ ఆదేశాల మేరకే నిధులు ఇవ్వడం లేదని చెప్పారు. మున్సిపాలిటీ నిర్వహణ, వేతనాల మేరకు ఖజానాలో నిధులు ఉన్నాయని, అదనంగా నిధులు మంజూరుకు అవకాశం లేదన్నారు. ఇప్పటికే గతంలో చేపట్టిన అభివృద్ధి పనులకు రూ.10 కోట్లు ఇవ్వాల్సి ఉందని తెలిపారు.

గురుకుల పాఠశాలలో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానం

ఘట్‌కేసర్ : సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్న నేపథ్యంలో ఫిబ్రవరి 1 వరకు దరఖాస్తు చేసుకోవాలని జగద్గిరిగుట్ట గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ జూపల్లి రేణుక తెలిపారు. ఘట్‌కేసర్ మున్సిపాలిటీ పరిధి అంకుషాపూర్‌లోని గురుకుల పాఠశాలలో 5 నుంచి 9వ తరగతిలో ప్రవేశాల కొరకు దరఖాస్తు చేసుకోవాలని చెప్పారు. జనన ధ్రువీకరణ, కులం, ఆదాయం, నివాసం, ఆధార్, ఫొటోలతో మీ సేవలో రూ.100 రుసుం చెల్లించి 2025 ఫిబ్రవరి 1 లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఫిబ్రవరి 23న ఉదయం 11 నుంచి మధ్యాహ్నం1 గంట వరకు ఉమ్మడి ప్రవేశ పరీక్ష నిర్వహింపబడుతుందన్నారు. విద్యార్థులు, తల్లిదండ్రులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు.

అభివృద్ధి పనులు ప్రారంభం

రామంతాపూర్ : డివిజన్ పరిధిలోని శ్రీనగర్ కాలనీలో శుక్రవారం రూ.15 లక్షల వ్యయంతో కూడిన యూజీడీ పైపులైన్ పనులను శుక్రవారం ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, కార్పొరేటర్ శ్రీవాణి వెంకట్‌రావుతో కలిసి ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రామంతాపూర్ డివిజన్‌ను అన్నివిధాలుగా అభివృద్ధి చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో నాయకులు కుమారస్వామి, నారాయణదాసు, అంజయ్య, రవి, కృష్ణమూర్తి, వెంకట్రావు, లింగం, సుధాకర్, నాగేశ్, రాంబ్రహ్మం, కాలనీ అధ్యక్షుడు దండు సంతోష్, పాశం బాల్‌రాజు, ప్రవీణ్‌యాదవ్, అజ్మత్‌పాషా పాల్గొన్నారు.

వైకుంఠ ఏకాదశి సందర్భంగా మీర్‌పేట్ హెచ్‌బీ కాలనీ డివిజన్ మంగాపురంలోని శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయంలో స్వామివారిని ఉత్తరద్వారం గుండా దర్శించుకొన్న అనంతరం ఆలయం ప్రాంగణంలో ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, కార్పొరేటర్ జే.ప్రభుదాస్, మాజీ కార్పొరేటర్ జి.శ్రీనివాస్ రెడ్డి, ఈఓ రవీందర్‌రెడ్డి, స్థానికులు

- మల్లాపూర్

సేవ చేయడంలోనే ఆనందం

బొమ్మలు అందజేస్తున్న మెర్సి హ్యాండ్స్ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షురాలు కెరోలిన్

జవహర్‌నగర్, జనవరి 10: సేవ చేయడంలోనే ఆనందం ఉంటుందని మెర్సి హ్యాండ్స్ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షురాలు కెరోలిన్ అన్నారు. శుక్రవారం ప్రభుత్వ దివ్యాంగుల పాఠశాలలో విద్యార్థులకు బొమ్మలు, వాటర్ బాటిళ్లను ఆమె పంపిణీ చేశారు. మానసిక విద్యార్థులకు మనోధైర్యాన్ని అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిదన్నారు. ఈ సందర్భంగా సైకాలజిస్ట్ శోభ మాట్లాడుతూ.. మానసిక విద్యార్థులు ఎదగడానికి ప్రభుత్వం సహకారం అందిస్తున్నదని, దాతలు ఇటువంటి సేవా కార్యక్రమాలు చేపట్టి వారికి మనోధైర్యాన్ని కల్పించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం నరేందర్, ఉపాధ్యాయురాలు పావని, విద్యార్థులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం

మేడ్చల్ కలెక్టరేట్, జనవరి 10 : నాగారం మున్సిపాలిటీ పరిధిలోని 18వ వార్డులోని అన్నమయ్య కాలనీలో మున్సిపాలిటీ సాధారణ నిధులు రూ.35 లక్షలతో చేపట్టిన సీసీ రోడ్డు నిర్మాణ పనులను చైర్‌పర్సన్ కౌకుట్ల చంద్రారెడ్డి శుక్రవారం ప్రారంభించారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు హరిబాబు, సూర్వి శ్రీనివాస్ గౌడ్, కాలనీవాసులు పాల్గొన్నారు.

స్పోర్ట్స్ ఫియాస్టా ఒలింపిక్ టోర్నీ

ఉప్పల్ : నాచారంలోని డెక్కన్ స్ప్రింగ్స్ గ్లోబల్‌స్కూల్‌లో స్పోర్ట్స్ ఫియాస్టా ఒలింపిక్ టోర్నీ నిర్వహించారు. అథ్లెటిక్ ఈవెంట్లు, సాంస్కృతిక ప్రదర్శన నిర్వహించారు. ముఖ్యఅతిథిగా రాజకీయ, సామాజిక కార్యకర్త అరుణ బహుగుణ, వ్యాపారవేత్త రామ్మోహన్, అర్జున అవార్డు గ్రహీత జీవంజీ దీప్తి, జాతీయ అథ్లెటిక్స్ కోచ్ రమేశ్ నాగపురి విచ్చేరు. చైర్మన్ నవనీత రావు, మేనేజింగ్ డైరెక్టర్ నవీన్‌కుమార్, కోర్ హెడ్ ఆపరేషన్స్ కిశోర్‌కుమార్ రెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ సుమా మీనన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పశువుల దొడ్లను తొలగించిన గుర్తు తెలియని వ్యక్తులు

పోచారం మున్సిపాలిటీ కాచివాని సింగారంలో గుర్తు తెలియన వ్యక్తులు చదును చేసిన పశువుల దొడ్ల స్థలం

పోచారం : పశువుల దొడ్లను గుర్తుతెలియని వ్యక్తులు తొలగించిన ఘటన పోచారం మున్సిపాలిటీ కాచివానిసింగారంలో శుక్రవారం చోటుచేసుకున్నది. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. సర్వే నం.83 స్థలంలో 80 ఏండ్ల క్రితం నుంచి పశువుల దొడ్లను ఏర్పాటు చేసుకున్నామని..ఉన్నట్టుండి శుక్రవారం ఉదయం నగరం నుంచి 20 మంది గుర్తు తెలియని వ్యక్తులు రెండు జేసీబీలు, పోలీసులతో వచ్చి తొలగించారన్నారు. కబ్జాలో ఉన్న పేదలు ఎదురు తిరుగడంతో ఉద్రిక్తత నెలకొన్నది. మాజీ సర్పంచ్ కొంతం వెంకట్‌రెడ్డి, నాయకుడు మట్ట విష్ణు కల్పించుకొని ప్రశ్నించగా.. స్థలాన్ని మేము కొనుగోలు చేశామని పది పశువుల దొడ్లను పూర్తిగా తొలగించి వెళ్లిపోయారు. అనంతరం గ్రామస్తులు మేడిపల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు.

వృద్ధురాలు అదృశ్యం

నేరేడ్‌మెట్ : వృద్ధురాలు అదృశ్యమైన ఘటన నేరేడ్‌మెట్ పీఎస్ పరిధిలో జరిగింది. ఎస్సై చంద్ర శేఖర్ తెలిపిన వివరాల ప్రకారం.. సింహాద్రినగర్‌లో నివాసముంటున్న శాంతిదేవి శుక్రవారం ఉదయం ఇంటి నుంచి బయటికెళ్లి సాయంత్రం వరకు తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు అంతటా వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో వారు శుక్రవారం సాయంత్రం పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని విచారిస్తామని తెలిపారు.

సంక్రాంతికి ఊరెళ్తున్నారా..తస్మాత్ జాగ్రత్త

కీసర సీఐ వెంకటయ్య

కీసర, జనవరి 10 : సంక్రాంతికి ఊర్లకు వెళ్తున్న ప్రజలంతా తమ ఇంటి విషయంలో అప్రమత్తంగా ఉండాలని కీసర సీఐ వెంకటయ్య తెలిపారు. రాచకొండ కమిషనరేట్ ఆదేశాల మేరకు దొంగతనాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఆదేశాలు సీఐ జారీచేశారు. సీఐ మాట్లాడుతూ.. ఇంట్లోని విలువైన వస్తువులు, నగదు, బంగారంను బ్యాంక్ లాకర్‌లో దాచుకోవాలన్నారు. బీరువా తాళాలు బీరువా పైన కాని బట్టల కింద పెట్టవద్దని, వాహనాలను ఇంట్లోనే పార్క్ చేసి తాళం చెవులను వెంట తీసుకెళ్లాలని సూచించారు. తలుపులకు సెంటర్ లాక్ వేసి బయట గొళ్లెం పెట్టవద్దని, నాసిరకం తాళాలు వాడరాదని, తాళాలు కనబడకుండా కర్టెన్ వేయాలని సూచించారు. ఇంటి తలుపుల ఎదుట చెప్పులు ఉంచి వెలుతురు ఉండేలా చూసుకోవాలన్నారు. మీరు ఊరు వెళ్తున్నట్లు పేపర్‌బాయ్, పాలుపోసే వాడికి సమాచారం ఇవ్వాలని, ఇంటి దగ్గర నమ్మకమైన వాచ్‌మేన్‌ను నియమించుకోవాలన్నారు. మీ కాలనీ, ఇంట్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకొని భద్రత ప్రదేశంలో ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఊర్లకు వెళ్తున్నప్పుడు స్థానిక పీఎస్‌లో ఫిర్యాదు చేయాలని, ఇంటి పక్కవారికి ఫోన్ చేసి వివరాలను తెలియజేయాలన్నారు. అత్యవసర సమయంలో అనుమానం కల్గితే టోల్ ఫ్రీ నం. 100 , రాచకొండ కంట్రోల్ రూం 87126 62666 లేదా వాట్సప్ నం. 8712662111కు సంప్రదించాలని కీసర సీఐ తెలిపారు.

ఘట్‌కేసర్ పీఎస్ ఆవరణలో వాయిస్ రికార్డర్ ఆటోను ప్రారంభిస్తున్న ఏసీపీ చక్రపాణి

దొంగతనాల నివారణకు సూచనలు పాటించాలి

ఘట్‌కేసర్ : సంక్రాంతి నేపథ్యంలో దొంగతనాల నివారణకు పోలీసుల సూచనలు పాటించాలని మల్కాజిగిరి ఏసీపీ చక్రపాణి తెలిపారు. ఘట్‌కేసర్ పీఎస్ పరిధిలోని ప్రజలకు అవగాహన కల్పించేందుకు ఫ్లెక్సీ, వాయిస్ రికార్డర్ ఆటోను శుక్రవారం ప్రారంభించారు. సలహాలు, సూచనలతో కూడిన ఫ్లెక్సీ ఆటోకు అమర్చి వీధుల్లో వాయిస్ రికార్డర్‌తో ప్రచారం చేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఇన్‌స్పెక్టర్ పి.పరుశురాం, డీఐ శ్రీనివాస్ పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

రెండ్రోజులు ఉచిత ప్లాస్టిక్ సర్జరీ పరీక్షలు

కంటోన్మెంట్ : ఓల్డ్ మల్లేపల్లి సీతారాంబాగ్‌లోని లయన్స్ క్లబ్ దవాఖానలో 17, 18 తేదీల్లో ఉచిత ప్లాస్టిక్ సర్జరీ పరీక్షలు నిర్వహించనున్నట్లు రాంకీ ఫౌండేషన్ చైర్మన్ మువ్వా రాంరెడ్డి, లయన్స్‌క్లబ్ ఆఫ్ హైదరాబాద్ గ్రీన్ ల్యాండ్ ప్రతినిధి విద్యాభూషణ్, పరవస్తు క్రియేటీవ్ ఫౌండేషన్ సెక్రటరీ సందీప్ హరి పేర్కొన్నారు. గ్రహణ మొర్రి, కాలిన గాయాలతో బాధ పడే వారికి, చేతి వేళ్లు, గొంతు అతుక్కొని ఉన్న వారికి సర్జరీ నిర్వహించడానికి శిబిరం ఏర్పాటు చేశామన్నారు. 17, 18 తేదీల్లో స్క్రీనింగ్ క్యాంప్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 12–14 ఏండ్ల పిల్లలను ప్రభావితం చేసే వైకల్యాల గురించి ఈ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. 16వ తేదీలోపు స్క్రీనింగ్ పరీక్షలకు సంబంధించి రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని సూచించారు. 20 నుంచి 30వ తేదీ వరకు 10 రోజుల పాటు శస్త్ర చికిత్సలు చేయబడుతుందని తెలిపారు. సర్జరీ చేయించుకోవాలనుకునే వారు 9908630301, 9848241640 లో సంప్రదించాలని సూచించారు.

చిల్డ్రన్స్ స్కీం - 2024పై అవగాహన

చర్లపల్లి, జనవరి 10 : జాతీయ న్యాయ సేవాధికార సంస్థ, తెలంగాణ రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు కుషాయిగూడలోని మేడ్చల్ జిల్లా కోర్టు ఆవరణలో నల్సా చైల్డ్ ఫ్రెండ్లీ లీగల్ సర్వీస్ ఫర్ చిల్డ్రన్స్ స్కీం – 2024పై జిల్లా న్యాయమూర్తులు, న్యాయవాదులతో కలిసి జిల్లా ప్రధాన న్యాయమూర్తి బాల భాస్కర్‌రావు, జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి కిరణ్‌కుమార్ శిక్షణ తరగతులు, అవగాహన కల్పించారు. వారు మాట్లాడుతూ.. కక్షిదారుల సమస్యలను సత్వరమే పరిష్కరించేందుకు జాతీయ, రాష్ట్ర స్థాయిలో పలు చర్యలు తీసుకోవడం హర్షణీయమని, ముఖ్యంగా చిల్డ్రన్స్‌కు సంబంధించి పలు అంశాలపై చట్టాలకు లోబడి చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. న్యాయవాదులు, జిల్లా న్యాయమూర్తులు అడిగిన సూచనలు, ప్రశ్నలకు జవాబులు ఇచ్చారు. కార్యక్రమంలో చైల్డ్ వెల్ఫేర్ కమిటీ సభ్యులు అర్చనరావు, రాజిరెడ్డి, రాంమోహన్, సీడీపీఓ శారద, న్యాయవాదులు మానసరెడ్డి, జ్యోతిర్మయి,న్యాయవాదులు, సిబ్బంది పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి బాలభాస్కర్‌రావు, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కిరణ్‌కుమార్

పీర్జాదిగూడ అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళిక

పీర్జాదిగూడ : పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో మేయర్ అమర్‌సింగ్ అధ్యక్షతన శుక్రవారం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. కార్పొరేటర్లు, అధికారులతో అభివృద్ధి పనులపై చర్చించారు. స్ట్రాం వాటర్ పైపులైన్ పనులు, నీటి సరఫరా మరమ్మతులు, వీధిదీపాలతో పాటు అభివృద్ధి పనులకు రూ. 35 కోట్లు నిధులు కేటాయించినట్లు కార్పొరేటర్ల సమక్షంలో ఏకగ్రీవంగా తీర్మానించారు. మేయర్ మాట్లాడుతూ.. మున్సిపల్ కార్పొరేషన్ అభివృద్ధి చేసేందుకు ప్రత్యేక ప్రణాళికతో ముందుకు సాగుతున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో కమిషనర్ త్రిశేశ్వర్‌రావు, డిప్యూటి మేయర్ కుర్ర శివకుమార్‌గౌడ్, కార్పొరేటర్లు నవీన్‌రెడ్డి, సుభాష్ నాయక్, బైటింటి శారద ఈశ్వర్‌రెడ్డి, మంజుల రవీందర్, ప్రసన్నలక్ష్మీ శ్రీధర్‌రెడ్డి, పాశం శశిరేఖ, మహేశ్వరి, వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుదాం

కాప్రా : చెరువు, పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉండేవిధంగా ప్రజలందరూ సహకరించాలని డిప్యూటీ కమిషనర్ డి.జగన్ అన్నారు. శుక్రవారం కాప్రా, చర్లపల్లి, నాచారం ఎర్రకుంట, హెచ్ఎంటీనగర్ ప్రధాన చెరువుల పరిసర ప్రాంతాల్లో డీజీ జగన్ ఆదేశాలతో జీహెచ్ఎంసీ శానిటేషన్, ఎంటామాలజీ సిబ్బంది చెరువు పరిసరాల్లో చెత్తను సేకరించారు. ఎంటామాలజీ సిబ్బంది ఆంటీలార్వల్ స్ప్రే చేయడం, గుర్రపుడెక్క తొలగించారు. కార్యక్రమాలను జీహెచ్ఎంసీ చీఫ్ మెడికల్ ఆఫీసర్ పద్మజ, కాప్రా సర్కిల్ ఏఎంఓహెచ్ డాక్టర్ మధుసూదన్‌రావు, జీహెచ్ఎంసీ స్వచ్ఛభారత్ మిషన్ విభాగం వైద్యులు డాక్టర్ శంకర్, డాక్టర్ రజనీకాంత్ పరిశీలించారు. శానిటరీ సూపర్‌వైజర్ సుదర్శన్, క్షేత్రస్థాయి సిబ్బంది పాల్గొన్నారు.

భవన నిర్మాణ కార్మికుల సమస్యలు పరిష్కరిస్తాం

చర్లపల్లి, జనవరి 10 : చర్లపల్లి డివిజన్ పరిధిలోని భవన నిర్మాణ కార్మికుల సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేయనున్నట్లు కార్పొరేటర్ బొంతు శ్రీదేవి పేర్కొన్నారు. పెద్ద చర్లపల్లి చౌరస్తాలో దుర్గామాత భవన నిర్మాణ కార్మిక సంఘం, సెంట్రింగ్ కార్మికుల యూనియన్ ఆధ్వర్యంలో రూపొందించిన క్యాలెండర్‌ను కార్పొరేటర్ ఆవిష్కరించారు. సమస్యలను దశలవారీగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు.

గురుకుల కళాశాలలో వేడుకలు

శామీర్‌పేట : సంక్రాంతిని సంతోషంగా జరుపుకోవాలని సాంఘిక సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ కళాశాల జగద్గిరిగుట్ట ప్రిన్సిపాల్ డాక్టర్ ఇశ్రత్ అన్నారు. శామీర్‌పేటలోని క్యాంపస్‌లో సంక్రాంతిని పురస్కరించుకుని కళాశాల యాజమాన్యం, విద్యార్థులతో కలసి వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ చేతన, కల్చరల్ కో – ఆర్డినేటర్స్ ధనవేణి, శిల్ప రాథోడ్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

13, 14న ముగ్గులు, గాలిపటాల పోటీలు

శామీర్‌పేట : సంక్రాంతి సందర్భంగా ముగ్గులు, గాలిపటాలు, సంగీత విభావరి పోటీల్లో ఔత్సాహికులు పాల్గొనాలని దేవరయాంజాల్ నిర్వాహకుడు పీసరి మహిపాల్‌రెడ్డి కోరారు. తూంకుంట మున్సిపాలిటీ దేవరయాంజాల్‌లో ఈ నెల 13, 14వ తేదీల్లో ముగ్గులు, గాలిపటం(కైట్) సంగీత విభావరి(లైవ్ మ్యూజిక్) పోటీలు నిర్వహించడం జరుగుతుందన్నారు.

ఉప్పల్, జనవరి 10 : హబ్సిగూడలోని స్ఫూర్తి మహిళా డిగ్రీ కళాశాల ఆవరణలో చేపట్టిన రంగవల్లుల కార్యక్రమం ఆకట్టుకున్నది. విద్యార్థినులు పలు రకాల విభిన్న ఆకృతులతో ముగ్గులు వేశారు. కార్యక్రమానికి కళాశాల చైర్మన్ రాపర్తి సురేశ్ హాజరైనారు. విద్యార్థినులు వేసిన ముగ్గులను పరిశీలించి, అభినందించారు.